
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం ׀ 5 ׀ సెప్టెంబర్ ׀ 2024



సోమశిలలో 41.094 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 41.094 టీఎంసీలు ఉన్నాయి. పైతట్టు నుంచి 17,430 క్యూసెక్కుల వరద వస్తోంది.పెన్నార్ డెల్టాకు 700, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలుకు 6 వేలు, కావలి కాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,622
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,821
నవర (8 గ్రాములు)	రూ.54,568

గరిష్టం/కనిష్టం
30.7 /26.9

వాతావరణం

జిల్లాలో వాతావరణం గురువారం తేమగా ఉండి అక్కడక్కడ జల్లులు పడొచ్చని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ బుధవారం 89 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాల కిట్ల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల కిట్లను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారి సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క కిట్‌లో తొమ్మిది రకాల విత్తనాలు 10 కేజీలు ఉంటాయని, ఈ కిట్ 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నామన్నారు. ఒక్కో రైతుకు ఐదు కిట్‌లు మాత్రమే పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో ఈ విత్తనాల కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని కోరారు.

17 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తులు సమర్పించొచ్చు

నెల్లూరు (టౌన్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ పీవీజే రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.5 లక్షల్లోపు ఉండాలన్నారు. పరీక్ష ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చెల్లించాలన్నారు.

వరద బాధితులకు బులియన్ మర్చంట్స్ ఆపన్నహస్తం

• రూ.3 లక్షల చెక్కు అందజేత



రవీంద్రనాథ్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్

నెల్లూరు (బృందావనం): విజయవాడ వరద బాధితులకు ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆపన్న హస్తం అందించింది. జాయింట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ ఎ.రవీంద్రనాథ్‌రెడ్డికి రూ. 3,01,116 నగదును చెక్కుకు బుధవారం అందజేశారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు మాట్లాడుతూ కట్టుబట్టలతో నిరాశ్రయులైన ప్రజానీకాన్ని ఆదుకోవాలన్న సంకల్పంతో సహాయం చేశామన్నారు. ఆ అసోసియేషన్ కార్యదర్శి ఆరవేటి ఫణీంద్ర, ఉపాధ్యక్షుడు తిరువీధి కిషోర్, కోశాధికారి బోగనాథం సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి చందోలు సతీష్‌కుమార్, ఏల్చూరు శ్రీనివాసులు, హజరత్‌బాబు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాయకులను అవమానిస్తారా?

• హామీలు అమలు చేయకపోవడం బాబు ట్రాక్ రికార్డు
• వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
• నావంతు సహాయంగా రూ.50 లక్షల విరాళం
• మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, చిత్రంలో కాకాణి, పర్వతరెడ్డి, ఆనం అరుణమ్మ, విజయకుమార్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (బారకాసు): ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మరుపురాని దివంగత నేతలు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి పేర్లను నెల్లూరు, సంగం బ్యారేజీలకు పెడితే వాటిని ఇప్పుడు చంద్రబాబు మార్చడం అంటే వారిని అవమానించినట్లేనని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో వరదల కారణంగా లక్షలాది మంది అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులను రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రజలందరూ సహాయం చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే సంగం, నెల్లూరు పెన్నా బ్యారేజీలకు పెట్టిన రెండు పేర్లతో పాటు రాష్ట్రంలో పలువురు నేతల పేర్లను చంద్రబాబు తొలగించారన్నారు. రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదని ఈ రోజు ఉంటుంది.. పోతుంది. కాకపోతే ఎవరు ఏం పని చేశారని, ప్రజలకు ఎంత మంచి చేశారనేది జీవితంలో నిలిచిపోతుందన్నారు. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను నెరవేర్చేందుకు ప్రథమ అజెండాగా పెట్టుకోవాలే కాని ఇలా పేర్లు తొలగింపు కార్యక్రమం పెట్టుకోవడం ఎంత వరకు సబబు అని చంద్రబాబుని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకపోవడం చంద్రబాబు ట్రాక్ రికార్డు అని ఎద్దేవా చేశారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో చెప్పినవి, చెప్పనవి కూడా అమలు చేసి చూపించారన్నారు. అమరావతిలో రాజధాని కరెక్ట్ కాదని శివరామకృష్ణ కమిటీ చెప్పినా కూడా చంద్రబాబు వినలేదని, ఇప్పుడు వరదలతో మునిగిపోవడం అందరూ చూస్తున్నారన్నారు. శేష జీవితంలో అయినా ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన చంద్రబాబుకు రావాలని హితవు పలికారు.

వరద బాధితులకు రూ.50 లక్షల విరాళం

భారీ వర్షాలతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సహాయార్థం తన వంతుగా ఒక్కో రాష్ట్రానికి రూ.25 లక్షలు చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు రూ.50 లక్షలు విరాళాన్ని అందజేయనున్నట్లు ప్రకటించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడుసార్లు జిల్లాకు వచ్చారన్నారు. ఆయన జ్ఞాపకార్థం సంగం బ్యారేజీకి పేరు పెట్టారన్నారు. జిల్లా సాగునీటి ప్రాజెక్ట్‌లకు ఏర్పాటుకు కృషి చేసిన దివంగత మాజీమంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు నెల్లూరు బ్యారేజీకి పెట్టడం జరిగిందన్నారు. అయితే ఆ పేర్లను తొలగించడం వల్ల చంద్రబాబుకు వచ్చిన లబ్ధి ఏమిటో అర్థం కావడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా సస్యశ్యామలంగా ఉందంటే అందుకు కారణం దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ చేసిన కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ, బ్యారేజ్‌ల నిర్మాణాలు ఇలా ఎన్నో ఉన్నాయన్నారు. లక్ష ఎకరాలకు సాగు అందించిన ఘనత డాక్టర్ వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డిలదేనని చెప్పారు. రాజకీయాల్లో మచ్చలేని నాయకులుగా మేకపాటి గౌతమ్‌రెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి రాణించారని, వారి పేర్లు సంగం, నెల్లూరు బ్యారేజీలకు పెట్టడం సమంజసమన్నారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి టీడీపీకి ఎక్కువ సేవ చేశారని, అలాంటి మహనీయుడి పేరును చంద్రబాబు తొలగించడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ నేతలు మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి, పేర్నాటి కోటేశ్వరరెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ 1.40 లక్షల నగదు చోరీ

నెల్లూరు(క్రైమ్): షాప్ షట్టర్ వంచి టేబుల్ డెస్క్‌లో ఉన్న రూ.1.40 లక్షల నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించారు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌కు చెందిన ప్రసన్నకుమార్ ఏసీ సెంటర్‌లోని గాయత్రి ఆటో డిస్ట్రిబ్యూటర్స్ షాపులో పని చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో షాపు మూసి ఇంటికి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు షట్టర్ వంచి లోనికి ప్రవేశించారు. మంగళవారం జరిగిన వ్యాపారానికి సంబంధించి నగదును కౌంటర్ డెస్క్‌లో ఉంచగా అపహరించారు. పక్కనున్న రెండు మెడికల్ షాపుల షట్టర్లు వంచి చోరీకి యత్నించారు. ఈ మేరకు బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా

• డ్రైవర్‌కు గాయాలు

వెంకటాచలం: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడి డ్రైవర్ గాయపడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు వైపు నుంచి సర్వేపల్లి వైపు ఇనుప కమ్ములతో వెళ్తున్న ట్రాక్టర్ తిక్కవరప్పాడు సమీపానికి చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

అమ్మకాల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



ఫర్టిలైజర్స్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి

• జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

పొదలకూరు : ఎరువులు, పురుగు మందుల అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి హెచ్చరించారు. పొదలకూరులో బుధవారం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ఫర్టిలైజర్స్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే వ్యవసాయ సీజన్లో రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాల్సిందిగా సూచించారు. రిజిస్టర్లు, బిల్ బుక్స్ మెయింటెయిన్ చేయాలని ఆదేశించారు. ఎరువుల అమ్మకాల్లో తేడాలు ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం సబ్‌డివిజన్ పరిధిలోని వీఏఏల ఒక రోజు శిక్షణ శిబిరాన్ని స్థానిక పరిశోధనా స్థానంలో ఏర్పాటు చేశారు. డీఏఓ సత్యవాణి మాట్లాడుతూ వీఏఏలు ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. రైతులకు నీటి లభ్యతను బట్టి సాగు చేసే విధానాన్ని అలవాటు చేయాల్సిందిగా సూచించారు. పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రసన్నరాజేష్ వేరుశనగలో రకాలు, సాగు పద్ధతులు, చీడపీడలను వివరించారు. జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏపీఎంఐ ప్రాజెక్ట్ పీడీ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ సూక్ష్మ సేద్యం పథకంలో రైతులకు కల్పిస్తున్న రాయితీను వివరించారు. పరిశోధనా స్థానం ఎంటమాలజీ (కీటక) శాస్త్రవేత్త సురేఖ అపరాల సాగులో తెగుళ్లు, పురుగు మందుల పిచికారిపై మాట్లాడారు. పాథాలజీ (వ్యాధినిర్ధాణ) శాస్త్రవేత్త హసీనా మాట్లాడుతూ పంటల సాగులో ఆశించే తెగుళ్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శివనాయక్, నర్సోజీరావు, ఏఓలు వాసు, శశిధర్, ప్రతాప్, సోమసుందర్, జహీద్, శ్రీదేవి, శేషగిరి, జిల్లా కేంద్ర వనరుల నుంచి లక్ష్మీమాధవి, ప్రకృతి వ్యవసాయ డీపీఓ మాలకొండయ్య, అడిషనల్ డీపీటీ మునిరత్నం, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఆచార్య దేవో భవ



• భావిభారత నిర్మాతలు ఉపాధ్యాయులు
• నేడు ఉపాధ్యాయ దినోత్సవం
• జిల్లాలో 60 మందికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

నెల్లూరు (టౌన్): అజ్ఞాన పొరలు తొలగించి జ్ఞాన దీపం వెలిగించేది గురువులు. తల్లిదండ్రుల తర్వాత స్థానం వారిదే. రేపటి సమాజాన్ని తేజోమయం చేయడంలో వీరి స్థానం గొప్పది. భారతరత్న, దేశ తొలి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజు సెప్టెంబరు 5న ఏటా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 60 మందిని ఎంపిక చేశారు. హెడ్ మాస్టర్ల విభాగంలో మనుబోలు జెడ్పీహెచ్‌ఎస్ ప్లస్ హెడ్‌మాస్టరు ఎస్. వసంతకుమారి, అనంతసాగరంలోని టీజీఎన్ జెడ్పీహెచ్‌ఎస్ ప్లస్ హెడ్‌మాస్టర్ బి.లక్ష్మీప్రసన్న, కందుకూరు మండలం మాచవరం జెడ్పీహెచ్‌ఎస్ హెడ్‌మాస్టర్ జి. మాల్యాద్రి అవార్డులు అందుకోనున్నారు. వీరితో పాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల్లో పని చేస్తున్న 24 మంది స్కూల్ అసిస్టెంట్లు, 33 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేయనున్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు.



సుధావాణి

చదువుకున్న బడిలోనే ఉపాధ్యాయినిగా..

దర్గామిట్టలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో హిందీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న సుధావాణి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం అదే పాఠశాలలో చదివారు. ఉన్నత విద్యాభ్యాసం తర్వాత 1998లో ఓజిలి మండలం బొట్లకనుపూరు ఎంపీపీ స్కూల్‌లో ఎస్జీటీగా జీవితాన్ని ప్రారంభించారు. 2009లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది ఓజిలి మండలం చిలమానుచేనులోని హైస్కూల్‌లో పనిచేశారు. తాను చదివిన స్కూల్‌లోనే స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధావాణి అదే పాఠశాలలో పదవీ విరమణ పొందనున్నారు. అదే పాఠశాలలో పని చేసే సమయంలో జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారీలో, మాడ్యూల్ రైటర్‌గా అవార్డులు అందుకున్నారు. సోషల్ సర్వీసులో ఏసీఎన్ వేదిక కల్చర్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సొంత నిధులతో దర్గామిట్ట జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గ్రిల్స్, రన్నింగ్ వాటర్‌కు సామగ్రిని అందజేశారు. కేన్సర్ పేషెంట్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య



నెల్లూరు (క్రైమ్): గుర్తుతెలియని మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై బుధవారం రాత్రి జరిగింది. మృతురాలికి సుమారు 30 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉంటుంది. నలుపు లైట్ పింక్ డిజైన్ చీర, నలుపు లైట్ పింక్ డిజైన్ జాకెట్ ధరించి ఉంది. ఘటనా స్థలిని నెల్లూరు రైల్వే ఎస్సై జి. మాలకొండయ్య పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

• వరద బాధితుల సహాయార్థం ఆహార పదార్థాల సేకరణ
• సీఎంఆర్‌ఎఫ్ ఖాతాకు నగదు చెల్లింపులు
• చెక్కులు, డ్రాఫ్టులు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓకు అందజేయండి
• కలెక్టర్ ఆనంద్



నెల్లూరు (దర్గామిట్ట): భారీ వర్షాలు, వరదలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విజయవాడలోని బాధితుల కోసం ఆహార పదార్థాలు సేకరణకు నెల్లూరు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దయార్థులు బిస్కెట్లు, బ్రెడ్స్, పాలు, వాటర్ బాటిళ్లు తదితర ఆహార పదార్థాలను స్వచ్ఛందంగా కౌంటర్‌లో అందజేయాలని కోరారు. ప్రత్యేక వాహనాల్లో విజయవాడలోని బాధితులకు అందజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆహార పదార్థాలు అందజేసేవారు ఏఎస్‌ఓ అంకయ్యను 85000 40699 సెల్ నంబరులో సంప్రదించాలన్నారు. నగదు అందజేయాలనుకుంటే సీఎం రిలీఫ్ ఫండ్ ఎస్‌బీఐ ఖాతా నంబరు 38588079208, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్001884, సీఎం రిలీఫ్ ఫండ్ యూనియన్ బ్యాంక్ ఖాతా నంబరు 110310100029039, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0830798 ఏపీ సెక్రటేరియట్ వెలగపూడి బ్రాంచ్ ఖాతాకు చెల్లించవచ్చునని తెలిపారు. చెక్కు, డ్రాఫ్ట్ రూపంలో అందజేయాలనుకునే నెల్లూరు కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓకు అందజేస్తే, అన్ని చెక్కులను కలిపి సీఎంఆర్‌ఎఫ్ ఖాతాకు జమ చేస్తామని వివరించారు.

విజిలెన్స్ ఎస్పీగా పీఆర్ రాజేంద్రకుమార్



నెల్లూరు (క్రైమ్): జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా పీఆర్ రాజేంద్రకుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ డీజీ హరీష్‌కుమార్‌గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజేంద్రకుమార్ జిల్లాకు సుపరిచితులే. గతంలో ఆయన నెల్లూరు రైల్వే డీఎస్పీగా, సీఐడీ ఏఎస్పీగా పని చేశారు. రైల్వేలో పనిచేస్తున్న సమయంలో మిస్టరీగా మారిన ఎన్నో కేసులను ఛేదించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి పలువురు నిందితులను కటకటాల వెనక్కి పంపారు. సీఐడీలోనూ సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ఆయన నేడో, రేపో జిల్లా విజిలెన్స్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇద్దరు మిత్రులు.. దొంగలయ్యారు

• విద్యుత్ మోటార్ దొంగల అరెస్ట్



కోవూరు: వ్యవసాయం చేసేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను దొంగతనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై రంగనాథ్‌గౌడ్ పట్టుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు వివరాలు వెల్లడించారు. ఇందుకూరుపేట మండలం పున్నూరుకు చెందిన వేగూరు రాజేష్, బద్దిపూడి శ్యామ్‌సుందర్ స్నేహితులు. ఆటోను నడుపుతుంటారు. ఇద్దరూ చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. ఈజీ మనీ కోసం రైతుల పొలాల్లోని మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేయడం ప్రారంభించారు. వాటిని పగులగొట్టి రాగి వైరును విక్రయించి జల్సాలు చేస్తున్నారు. బాధిత రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో కోవూరు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ.4 లక్షల విలువైన 12 మోటార్లు, 20 కేజీల రాగి, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో జిల్లా సిబ్బంది

• కన్‌స్ట్రక్షన్ ఈఈ ఆధ్వర్యంలో శరవేగంగా పనులు
• పలు విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ల మరమ్మతులు పూర్తి



విద్యుత్ పునరుద్ధరణ పనుల నిమిత్తం వెళ్లిన జిల్లా విద్యుత్ సిబ్బంది

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): విజయవాడలో వరదల తాకిడికి విద్యుత్ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. విద్యుత్ సబ్ స్టేషన్లలో నీరు చేరడం, స్తంభాలు పడిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులకు గురయ్యాయి. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదేశాల మేరకు విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు జిల్లా నుంచి 200 మంది విద్యుత్ అధికారులు, సిబ్బంది విజయవాడకు వెళ్లారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లు, మిల్క్ ప్రాజెక్ట్ సబ్ స్టేషన్, జక్కంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్లను పునరుద్ధరించి 11కేవీ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్‌శాఖ కన్‌స్ట్రక్షన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీధర్ ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయాల్లో తన సిబ్బందితో కలిసి వెళ్లి యుద్ధప్రాతిపదికపై విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టి తక్కువ సమయంలో విద్యుత్ సరఫరా అందిస్తూ అధికారులు, ప్రజల మన్ననలు అందుకుంటూ తోటి సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

మనుబోలు: ఇటీవల మనుబోలులో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎంఎస్ రాకేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. జూలై 28వ తేదీ మనుబోలు పడమటివీధిలో ఉంటున్న మొలకల శశిధర్‌రెడ్డిపై నలుగురు యువకులు కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. నిందితులుగా ఉన్న గూడూరు నాయుడు కాలువకట్టకు చెందిన కంచర్ల ధనరాజ్, గూడూరు రూరల్ మండలం చెన్నూరు గ్రామానికి చెందిన సిద్ధూ హోసన్న అలియాస్ సాయికుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. మిగిలిన ఇద్దరిని త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్సై తెలిపారు.

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	105
లేయర్ (లైవ్) :	105
బ్రాయిలర్ చికెన్ :	196
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	216
లేయర్ చికెన్ :	178